సాక్షి విశాఖపట్నం

సోమవారం ౹ 26 ౹ ఫిబ్రవరి ౹ 2024



పొత్తు పార్టీ చిత్తుకేనా?

టీడీపీ–జనసేన పార్టీల తొలి విడత జాబితా అనకాపల్లి నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లలో తీవ్ర అసంతృప్తి రగిల్చింది. 8లో



మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంప్ చెన్నై

ఆలిండియా మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంపియన్‌షిప్‌ను చెన్నై పోర్ట్ కైవసం చేసుకుంది. 8లో



గ్రూప్-2 పరీక్షకు 82.71 శాతం హాజరు 8లో

న్యూస్‌రీల్

రాష్ట్ర ఆహార ప్రయోగశాల ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: పెదవాల్తేరు వద్ద గల ఈఎస్‌టీ ఆసుపత్రి ప్రాంగణంలోని ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలలో ఏర్పాటు చేసిన రాష్ట్ర ఆహార ప్రయోగశాలను భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదివారం జాతికి అంకితం చేశారు. గుజరాత్‌లోని రాజ్‌కోట్ నుంచి వర్చువల్ విధానంలో ప్రధాని దీన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశాఖలోని ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలలో రూ.4.77 కోట్లతో ఏర్పాటుచేసిన మైక్రో బయోలజీ ల్యాబ్‌ను ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఈ ల్యాబ్ రాష్ట్రానికే గుండె లాంటిదని కొనియాడారు. విశాఖతో పాటు పలు ముఖ్య పట్టణాల్లో డయేరియా, ఇతర సమస్యలు వచ్చినప్పుడు ఆహారం, మంచినీటి నమూనాలను సేకరించి, ఎక్కువ సంఖ్యలో పరీక్షలు జరిపేందుకు ఇక్కడ వసతులను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని వివరించారు. త్వరలో 80 మంది సిబ్బందిని ఈ ప్రయోగశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేయనుందని తెలిపారు. కార్యక్రమంలో ఐపీఎం డైరెక్టర్ పూర్ణచంద్రరావు, ఎన్‌హెచ్‌ఎం డీడీ గణపతి రావు, ఏపీఎంఎస్‌ఐడిసి ఈఈ డి.అచ్చెం నాయుడు, ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ నంద, డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.జగదీశ్వరరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి జ్యోతిర్మయి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న జస్టిస్ జ్యోతిర్మయి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు అంతరాలయంలో అష్టోత్తరంపూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. గోదాదేవి సన్నిధిలో హారతి అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి ప్రసాదం, శేషవస్త్రాన్ని ఏఈవో పాలూరి నరసింగరావు అందజేశారు.

28న జాబ్‌మేళా

కంచరపాలెం : జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. అపోలో ఫార్మసీ, ఎస్ఆర్ అకాడమిక్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థల్లో 130 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామన్నారు. రిటైల్ ట్రైనీ, ఆఫీస్ అడ్మిన్, టెలీకాలర్, హోమ్‌కేర్, నర్సింగ్ స్టాఫ్, వర్క్ ఫ్రమ్ హోమ్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఎం/బి/డి ఫార్మసీ, ఎంఎల్‌టీ, జీఎన్ఎం, నర్సింగ్ ఉద్యోగాల బట్టీ ఉత్తీర్ణత సాధించిన 18–30 ఏళ్ల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళంలో జాబ్ లోకేషన్ ఉంటుందన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి జీతం నెలకు రూ.10,500 – 20,000వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

మార్చి 3న 'పల్స్ పోలియో'



డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: పల్స్ పోలియో కార్యక్రమాన్ని మార్చి 3వ తేదీన నిర్వహించనున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. ఇప్పటికే జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసిందన్నారు. కలెక్టర్ మల్లికార్జున టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారన్నారు. జిల్లాలో 0–5 ఏళ్లలోపు 2,08,163 మంది పిల్లలు ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. జిల్లా మొత్తంగా 1,002 బూత్‌లు ద్వారా పోలియో చుక్కలు వేయనున్నామన్నారు. బూత్‌లో కాకుండా 74 మొబైల్ బృందాలు, 32 ట్రాన్సిట్ బృందాల ద్వారా కూడా పోలియో చుక్కలు వేసేలా ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 6,51,702 గృహాలను మార్చి 4,5 తేదీల్లో బృందాలుగా ఏర్పడి పరిశీలిస్తామన్నారు. ఏ కారణం చేతనైనా పోలియో చుక్కలు వేసుకోకపోతే ఇంటి వద్దే వేస్తామన్నారు. జిల్లాలో 2,65,820 డోసుల పోలియో వ్యాక్సిన్ అందుబాటులో ఉందన్నారు.

టీడీపీ Vs జనసేన సోషల్ వార్

సోషల్ మీడియా వేదికగా మాటల యుద్ధం









- బానిసలకు 24 ఎక్కువంటూ టీడీపీ శ్రేణుల కవ్వింపు మాటలు
- వెన్నుపోటు పొడుస్తున్నారంటూ జనసేన కార్యకర్తల ఆరోపణలు
- ఇక రెండు జెండాలు మోయలేమంటున్న జనసేన శ్రేణులు
- పవన్ కల్యాణ్ వైఖరికోదండం అంటూ పార్టీకి స్వస్తి
- వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగనే సీఎం అని బహిరంగంగా వెల్లడి

తొలి జాబితాతోనే యుద్ధం మొదలైంది.. ఈ యుద్ధం ఎన్నికల క్షేత్రంలో కాదు.. సామాజిక మాధ్యమాల్లో. వైరి శ్రేణుల మధ్య కాదు.. పొత్తు కౌగిల్లో ఉన్న పార్టీల మధ్య. పొత్తుల మాటున చంద్రబాబుకు అలవాటైన వెన్నుపోటుతో జనసేన నాయకులు, కార్యకర్తలు విలవిల్లాడుతున్నారు. మా నాయకుడ్ని సీఎం కుర్చీపై చూస్తామని అనుకుంటే.. ముష్టి విదిలించినట్లు 24 సీట్లు ఇవ్వడంపై జనసేన కార్యకర్తలు జీర్ణించుకోలేక.. ఈ కూలి బతుకులు మాకొద్దంటూ.. పవన్‌కు గ్లాసుకూ ఒక దండం పెట్టేస్తున్నారు. మీ తొత్తు పార్టీకి 24 సీట్లే ఎక్కువ మూసుకొని బానిసల్లా ఉండడమేనంటూ టీడీపీ కార్యకర్తలు కవ్వింపు మాటలతో రెచ్చగొడుతున్నారు. పావలా వంతు కూడా సీట్లు దక్కించుకోలేని జనసేన, పొత్తు పేరుతో బానిస పార్టీలాగానే జనసేనని చూస్తున్న టీడీపీ కార్యకర్తల మధ్య 'సోషల్' యుద్ధం జరుగుతోంది.

సాక్షి, విశాఖపట్నం : 'అన్నా.. ఇన్నాళ్లూ.. నీ మీద నమ్మకంతో జెండా పట్టి కూలీలా పనిచేశాం. రెండు జెండాలు పట్టుకొని తిరుగుదామని పిలుపునిస్తే.. తిరిగాం.. ఇంక మా వల్ల కాదు.. నీ కోసం క్షేత్ర స్థాయిలో మేం రొమ్ము విరుచుకొని పనిచేస్తుంటే.. నువ్వు చంద్రబాబు ఎదుట సాగిలాపడుతూ బాంచన్ దొర అన్నట్లుగా తలూపుతుంటే ఇంకా చూస్తూ తట్టుకోవడం మా వల్ల కావడం లేదు.. ఇక సెలవు అన్నా.. పవన్ అంటే ప్రాణం.. కానీ.. ఓటు మాత్రం వైఎస్ జగన్‌కే వేస్తాం..' అని ఒకరు.

'నీ మీద నమ్మకం పోయిందన్నా.. నీ వెంట నడిచే ఓపిక లేదు.. నడిచే ప్రసక్తే లేదు..' అంటూ మరొక జనసేన కార్యకర్త పవన్‌ని సోషల్ మీడియా వేదికగా తూర్పారబడుతున్నారు.

టీడీపీ, జనసేన సంయుక్తంగా విడుదల చేసిన తొలి జాబితా.. ఆయా పార్టీ శ్రేణుల్లో చిచ్చు రేపుతోంది. టీడీపీ, జనసేన శ్రేణులు ఒకరిపై ఒకరు సోషల్ మీడియాలో కత్తులు దూసుకుంటున్నారు. మాటల తూటాలతో యుద్ధం చేసుకుంటున్నారు. 2024లో కచ్చితంగా పవన్‌ని ముఖ్యమంత్రిగా చూస్తామని ఇన్నాళ్లూ కలలు కన్న జనశ్రేణులు.. అవన్నీ పగటి కలలని తేలడంతో.. ఏం చేయాలో పాలుపోని దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు. ఒక్కొక్కరుగా.. పార్టీకి ఇన్నాళ్లూ సేవలు చేసినా.. చివరికి బానిసల్లా పవన్ కల్యాణ్ మార్చేశారంటూ ఆవేదనతో జనసేనకు గుడ్‌బై చెబుతున్నట్లు సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఇలాంటి పొత్తులతో ఓట్ షేరింగ్ జరిగే ప్రసక్తే లేదనీ.. రాబోయే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అవుతారని బల్లగుద్దీ మరీ పోస్టుల్లో చెబుతున్నారు. వీటిని సహించలేని కొందరు జనసేన పార్టీ నాయకులు.. ఎప్పటిలాగానే.. వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిని కోవర్టులంటూ బూతు పురాణాలు లంకిస్తున్నారు. దీంతో.. సామాజిక మాధ్యమాల్లో జనసేన కార్యకర్తలు, నాయకులు రెండుగా చీలిపోయారు. కొందరు పవన్ ఏం చేసినా తప్పదు. ఆయన వెంటే నడుస్తామని నైరాశ్యంతో చెబుతుంటే.. సింహభాగం నాయకులు, కార్యకర్తలు మాత్రం.. చంద్రబాబు, లోకేష్‌తోపాటు పవన్‌నీ తిడుతూ.. ఈసారి వైఎస్ జగన్‌కే మా ఓటు.. ఆయనే సీఎం అని బాహాటంగానే తమ నిర్ణయాన్ని వ్యక్తం చేసే వర్గంగా విడిపోయారు.

జనసేనను ఆటాడుకుంటున్న టీడీపీ

మరోవైపు సీట్ల కేటాయింపుతో నిరాశ నిస్పృహలకు లోనైన జనసేన కార్యకర్తలు, నాయకులతో టీడీపీ శ్రేణులు ఆటాడుకుంటున్నాయి. పావలా బతుకులకు 24 సీట్లే ఎక్కువనీ.. ఇచ్చిన సీట్లన్నీ గెలిపించుకోగలరా అంటూ సవాల్ విసురుతున్నారు. మరికొందరు ఒకడుగు ముందుకెళ్లి.. చంద్రబాబు లేదా లోకేష్ సీఎం అవుతారు తప్ప.. పవన్‌కు డిప్యూటీ సీఎం పదవి కూడా ఇచ్చే ప్రసక్తే లేదంటూ ఎద్దేవా చేస్తున్నారు. ఇంకొందరైతే.. ముందు ఎమ్మెల్యేని చెయ్యండి.. తర్వాత సీఎంని చేసే ఆలోచన దగ్గరకు రండి అంటూ రెచ్చగొట్టే ధోరణితో మాట్లాడుతుండటంతో.. జనసేన సోషల్ మీడియా కార్యకర్తలు రగిలిపోతున్నారు. అనవసరంగా చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు మద్దతునిచ్చి పవన్ తప్పు చేశారనీ.. లేదంటే.. అచ్చెన్నాయుడు చెప్పినట్లు ఈ సమయానికి పార్టీ లేదు.. బొ–– లేదు అనే మాటే నిజమై ఉండేదని సమాధానమిస్తున్నారు. ఇలా.. రెండు రోజులుగా ట్విటర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో టీడీపీ, జనసేన మధ్య సోషల్ వార్‌నడుస్తోంది.

పర్యాటక తలమానికం ఫ్లోటింగ్ బ్రిడ్జి



ఫ్లోటింగ్ బ్రిడ్జిపై రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కోర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే వాసుపల్లి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్త కె.కె.రాజు, పార్టీ నాయకులు మళ్ల విజయప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ

- ఇప్పటికే విశాఖలో పలు పర్యాటక ప్రాజెక్టులు చేపట్టాం..
- బ్రిడ్జి ప్రారంభోత్సవంలో రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి

మహారాణిపేట : పర్యాటక కేంద్ర బిందువుగా పేరుగాంచిన విశాఖ మహా నగరం దేశంలోనే ప్రత్యేకమని, పర్యాటక రంగానికే తలమానికంగా నిలవనుందని వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ రాజ్యసభ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి అభివర్ణించారు. సాగరతీరంలో వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి(నీటిపై తేలియాడే వంతెన)ను రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జి వల్ల పర్యాటకుల సంఖ్య పెరుగుతుందన్నారు. కైలాసగిరి వద్ద రూ.5 కోట్లతో స్కై బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదించామని, అది కూడా త్వరలోనే అందుబాటులోకి వస్తుందని వెల్లడించారు. పర్యాటకులను ఆకర్షించేలా విశాఖను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో పలు బీచ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యం

కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ పర్యాటకుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. ఫ్లోటింగ్ బ్రిడ్జి నిర్వహణను పర్యవేక్షించేందుకు వీఎంఆర్డీఏ నుంచి ఒక అధికారి ఉంటారని వెల్లడించారు. పర్యాటకులు వంతెనపై వెళ్లినప్పుడు.. అటు ఇటూ రెండు బోట్లు సంచరిస్తాయని, గజ ఈతగాళ్లు ఉంటారని తెలిపారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడిన కలెక్టర్ నిర్వహణపరమైన లోపాలు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలని, నిబంధనలు అతిక్రమించి వ్యవహరించరాదని, ఒక్క సారి 15 మందికి మించి పంపించవద్దని సూచించారు. పర్యాటకులు తప్పకుండా లైఫ్ జాకెట్లు ధరించాలని చెప్పారు. తుపాన్లు, అధిక అలలు వచ్చే అమావాస్య, పౌర్ణమి వంటి రోజుల్లో బ్రిడ్జిని నిర్వహించవద్దని సూచించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, వీఎంఆర్డీఏ జాయింట్ కమిషనర్ రవీంద్ర, కార్యదర్శి డి.కీర్తి, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లోటింగ్ బ్రిడ్జిపై సందడి

ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు మళ్ల విజయప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ, వీఎంఆర్డీఏ కార్యదర్శి డి.కీర్తి తదితరులు కాసేపు ఫ్లోటింగ్ బ్రిడ్జిపై నడిచి సందడి చేశారు.



ఫ్లోటింగ్ బ్రిడ్జి



ఫ్లోటింగ్ బ్రిడ్జి వద్ద రెస్క్యూ టీమ్

యాదవులకు సముచిత స్థానం



యాదవ సంఘం భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కారుమూరి, మాజీ మంత్రి అనిల్‌కుమార్, మేయర్ హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ తదితరులు



మాట్లాడుతున్న వై.వి.సుబ్బారెడ్డి, చిత్రంలో మంత్రి కారుమూరి, ఎంపీ ఎంవీవీ, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు సమన్వయకర్తలు కేకే రాజు, చందు తదితరులు

- రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- యాదవ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.కోటి విరాళం ప్రకటించిన ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

కొమ్మాది : రాష్ట్ర చరిత్రలోనే యాదవులకు రాజకీయ పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పించిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఎండాడ జాతీయ రహదారి సమీపంలో యాదవ సంఘం భవన నిర్మాణానికి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లు విలువ చేసే స్థలాన్ని సంఘ భవన నిర్మాణానికి కేటాయించడంపై యాదవులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న అభిమానం ఎటువంటిదో తెలుస్తోందన్నారు. గత పాలకులు బీసీలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకున్నారే తప్ప ఉన్నత స్థానం కల్పించలేదని, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీ అంటే బ్యాక్ బోన్‌గా చూస్తున్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో 7 అసెంబ్లీ నియోజక వర్గాలు, పార్లమెంట్ స్థానాన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు గౌరవం పెరిగిందన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు యాదవులను ఎప్పుడైనా పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. వెలగపూడి రామకృష్ణబాబు ఎక్కడ నుంచి వచ్చారో నాకు తెలుసునని ఈ సారి ఎన్నికల్లో తిరిగి అక్కడికే పంపిద్దామన్నారు. వంశీకృష్ణ యాదవ్‌కు ఎమ్మెల్సీ ఇచ్చి గౌరవాన్ని పెంచితే పార్టీ మారిపోయాడని, ఆయనొక నష్టజాతకుడన్నారు. యాదవ సంఘ భవన నిర్మాణానికి రూ.కోటి విరాళం ప్రకటించిన ఎంవీవీ సత్యనారాయణను ఆయన అభినందించారు. మాజీ మంత్రి అనిల్ కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ యాదవ కులానికి ఎంతో ప్రాముఖ్యత ఇచ్చిందని తెలిపారు. దాదాపు అర ఎకరా స్థలాన్ని జాతీయ రహదారికి ఆనుకుని కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో విశాఖ ఎంపీగా యాదవులు రావాలని ఆకాంక్షించారు. 40 ఏళ్లు టీడీపీని నమ్మి మోసపోయామని ఈ సారి 80 శాతం ఓటింగ్ వైఎస్సార్‌సీపీకి పడేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండడం ఎంతో ఆనందంగా ఉందని, తాను విశాఖ ఆడపడుచునేనని అన్నారు. ఇక్కడ శంకుస్థాపన చేసింది యాదవ సంఘ భవనం కాదని మాధవ భవనం అన్నారు. ఎంపీ, విశాఖ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ యాదవ భవన నిర్మాణానికి తన వంతు రూ.కోటి విరాళం అందిస్తున్నానని తెలిపారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు ఏనాడైనా యాదవులకు ఒక్క గజం స్థలమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. విశాఖ తూర్పులో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెలగపూడి యాదవులను తొక్కుతూనే ఉన్నాడన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పిన్నింటి వరలక్ష్మి, సమన్వయకర్తలు కేకే రాజు, చందు, యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సన్యాసిరావు, మొల్లి అప్పారావు, కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, చైర్మన్లు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డికి ఆత్మీయ సత్కారం

సాక్షి, విశాఖపట్నం: రాజ్యసభకు ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డికి విశాఖలోని ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఆడిటర్ జీవీ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్రెడాయ్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, నెరెడ్కో, విద్యావంతులు, మేధావులు, పారిశ్రామికవేత్తలు, వ్యాపార వేత్తలు కలిసి వాల్తేరు క్లబ్‌లో ఆదివారం ఆత్మీయ అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖకు చెందిన పలువురు ప్రముఖులు మాట్లాడుతూ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రెండేళ్లుగా విశాఖ గణనీయంగా అభివృద్ధి చెందిందని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చెందేలా కృషి చేస్తారని అన్నారు. వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యసభకు వెళ్లేందుకు అవకాశం కల్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విశాఖ నగరాన్ని ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పథంలో తీసుకెళ్లారన్నారు. రానున్న రోజుల్లో ఈ అభివృద్ధి మరింతగా జరగాలంటే మరోసారి సీఎంగా జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పలనాగిరెడ్డి, రమణమూర్తిరాజు, మాజీ ఎమ్మెల్యేలు బాలరాజు, తిప్పల గురుమూర్తిరెడ్డి, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, పార్టీ నేత తైనాల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



సుబ్బారెడ్డిని సత్కరిస్తు మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వాసుపల్లి గణేష్‌కుమార్, తిప్పలనాగిరెడ్డి, రమణమూర్తి రాజు, మాజీ ఎమ్మెల్యేలు బాలరాజు, తిప్పల గురుమూర్తిరెడ్డి, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, ఆడిటర్ జీవీ, పార్టీ నేత తైనాల విజయ్‌కుమార్ తదితరులు

కాపుల సంక్షేమానికి పెద్దపీట




వంగవీటి రంగా, శ్రీకృష్ణ దేవరాయులు విగ్రహాలను ఆవిష్కరించి, నివాళులర్పిస్తున్న రాజ్యసభసభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజీవ్‌గాంధీ తదితరులు

- వైఎస్సార్‌సీపీలో వారికి విశేష గుర్తింపు
- రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి
- శ్రీకృష్ణ దేవరాయులు, వంగవీటి మోహన రంగా విగ్రహాల ఆవిష్కరణ
- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని పిలుపు



రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న పార్టీ నేతలు, కాపు సంఘ సభ్యులు

గోపాలపట్నం: కాపుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాజ్యసభ సభ్యుడు, పార్టీ ఉత్తరాంధ్ర రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో కాపు కల్యాణ మండపం వద్ద శ్రీకృష్ణ దేవరాయులు, వంగవీటి మోహనరంగా విగ్రహాలను విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బొత్స ఝాన్సీతో కలిసి ఆయన ఆవిష్కరించారు. తొలుత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకృష్ణ దేవరాయులు, వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో వైవీ సుబ్బారెడ్డి మాట్లాడారు. నవరత్నాల ద్వారా ప్రజలకు మేలు చేస్తున్నది మన ప్రభుత్వమేనన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా కాపుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు కాపులను ఏ విధంగా చూశాడో తుని సంఘటనే ఉదాహరణ అని గుర్తు చేశారు. ముద్రగడను ఎన్ని ఇబ్బందులు పెట్టారో అందరూ చూశామన్నారు. అక్రమ కేసులు పెట్టారని, జైల్లో పెట్టిన చరిత్ర చంద్రబాబుదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారిపై కేసులను కొట్టివేసిందన్నారు. కాపు నేస్తం ద్వారా ఆదుకుంటున్నారన్నారు. కాపులను అడ్డుపెట్టుకుని జనసేన నాయకుడు పవన్ కల్యాణ్..చంద్రబాబుకు బానిసగా మారాడన్నారు. ఐదేళ్లలో కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. విశాఖ పార్లమెంట్ ఇన్‌చార్జి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ శ్రీకృష్ణ దేవరాయులు పాలనలో రత్నాలను రాసులుగా పోసి అమ్మేవారని విన్నాం...అభినవ శ్రీకృష్ణ దేవరాయులు మన జగన్‌మోహన్ రెడ్డి పాలనలో నవరత్నాలను ప్రజలకు అందించే పాలన చూస్తున్నామన్నారు. నాకు విశాఖ పుట్టినిల్లని... ఇక్కడి వారంతా నాకు ఆత్మీయులన్నారు. కాపు సామాజిక భవనం కోసం రూ. 2 కోట్లు మంజూరు చేయించడం గొప్పవిషయమన్నారు. పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ కాపు కల్యాణ మండపాన్ని గత పాలకులు పునాదుల్లోనే వదిలేశారన్నారు. ఈ అంశాన్ని వైవీ సుబ్బారెడ్డి ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటామన్నారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి, బొత్స ఝాన్సీ, ఆడారి ఆనంద్‌కుమార్, వంగవీటి మోహన రంగ విగ్రహదాతలైన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పీవీ సురేష్, గుండపు నాగేశ్వరరావులను కాపు సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు మళ్ల విజయప్రసాద్, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ, బీఎస్ కృష్ణ, గంట్ల శ్రీనుబాబు, కాపు సంఘ నేతలు గంరెడ్డి అప్పల సత్యనారాయణ, కంపర సత్తిబాబు, 91, 92 వార్డుల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గుణొట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, గేదెల మురళీ కృష్ణ పాల్గొన్నారు.

పొత్తు పార్టీ చిత్తుకేనా?

- ఇదేమి నిర్ణయం.. తెలుగు తమ్ముళ్ల నిరసన గళం
- జనసేనకు అనకాపల్లి టికెట్ కేటాయింపుపై గరంగరం
- అధిష్టానం పునరాలోచించాలని డిమాండ్



మాజీ ఎమ్మెల్యే పీలాకు టికెట్ ఇవ్వనందుకు కశింకోటలో నిరసన తెలుపుతున్న టీడీపీ శ్రేణులు

అనకాపల్లి (యలమంచిలి రూరల్)/కశింకోట/అనకాపల్లి: టీడీపీ–జనసేన పార్టీల తొలి విడత అసెంబ్లీ అభ్యర్థుల జాబితా అనకాపల్లి నియోజకవర్గ తెలుగు తమ్ముళ్లలో తీవ్ర అసంతృప్తి రగిల్చింది. పదేళ్లుగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను కాదని జనసేనకు టికెట్ కేటాయించడం గందరగోళానికి దారితీసింది. ఇప్పటి వరకూ చంద్రబాబే తమకు ఇంద్రుడు, చంద్రుడు అని మాట్లాడినవారు ఇప్పుడు ఏకంగా పార్టీ అధినేత వైఖరినే తప్పుబడుతున్నారు. జిల్లా కేంద్రమైన అనకాపల్లిలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు పార్టీ టికెట్ వస్తుందని ఆయన అనుచరగణం, టీడీపీ శ్రేణులు భావించాయి. కాని అనూహ్యంగా ఈ సీటును పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయించడంతో ఆదివారం కశింకోట, అనకాపల్లి పట్టణాలలో తెలుగు తమ్ముళ్ల నిరసనలు పెల్లుబుకాయి. చంద్రబాబు తీరుపై ఆ పార్టీ నేతలే తీవ్రస్థాయిలో దుమ్మెత్తిపోస్తున్నారు. నెల రోజుల కిందట జనసేనలో చేరిన మాజీ మంత్రి కొణతాలను ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలపడం సరికాదంటున్నారు. ఈ మేరకు ఆదివారం కశింకోట మండల టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. తామంతా పీలా వెంటే ఉంటామని, ఆయనకు టికెట్ ఇవ్వకపోతే రాజీనామా చేస్తామని అధినేతకు హెచ్చరికలు పంపారు. అనకాపల్లిలో కూడా టీడీపీ నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఇలాంటి పొత్తుల వల్ల పార్టీకి నష్టమే తప్ప ప్రయోజనం ఉండదని, పార్టీకి అనుకూలంగా వున్న సీటును జనసేనకు ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నారు. నమ్మకాన్ని వమ్ము చేయడమే చంద్రబాబు నైజమని సొంత పార్టీ నేతలే విమర్శిస్తూ మీడియా సమావేశాలు నిర్వహించడం, సామాజిక మాధ్యమాల్లో వీడియోలను పోస్టు చేయడం టీడీపీ శ్రేణుల్లో తీవ్ర నైరాశ్యాన్ని తెచ్చింది. చంద్రబాబుకు మాటపై నిలబడే తత్వం లేదని, ఆయన మాటలకు, చేతలకు పొంతన లేదని నియోజకవర్గ టీడీపీ ముఖ్యనాయకులు బాహాటంగానే విమర్శలు చేస్తున్నారు.

మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధం

మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు టీడీపీ టికెట్ ఇవ్వకుంటే మూకుమ్మడిగా రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నామని కశింకోట మండల టీడీపీ శ్రేణులు హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం కశింకోటలోని గౌరమ్మ ఆలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో తీవ్ర నిరసన తెలిపారు. అనకాపల్లి పార్లమెంటు తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కష్టపడి నియోజక వర్గంలో కార్యకర్తలను నిరంతరం ఉత్తేజపరిచి పార్టీని నిలబెట్టుకుంటూ పటిష్టవంతం చేసిన పీలా వంటి వ్యక్తికి సీటు ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. పార్టీ శ్రేణులకు తెలియకుండా జనసేనకు టికెట్ కేటాయించడం శోచనీయమన్నారు. అధిష్టానం పునరాలోచించాలని కోరారు. పొత్తులో భాగంగా అనకాపల్లి ఎంపీ సీటు జనసేనకు కేటాయిస్తే పనిచేస్తామన్నారు. అయితే ఎమ్మెల్యే సీటు మాత్రం పీలాకు ఇవ్వాలన్నారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పెంటకోట రాము, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వేగి గోపీకృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, కొత్తపల్లి మాజీ సర్పంచ్ బుదిరెడ్డి గంగయ్య పాల్గొన్నారు.

గెలవలేని పార్టీతో మనకెందుకు పొత్తు

గెలవలేని జనసేన పార్టీతో టీడీపీకి పొత్తు ఎందుకని, అన్ని స్థానాలకు టీడీపీ అభ్యర్థులను నిలబెట్టాలని టీడీపీ సీనియర్ నాయకుడు బొద్దపు ప్రసాద్ డిమాండ్ చేశారు. అనకాపల్లి గవరపాలెంలోని పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ శ్రేణులు నల్లబ్యాడ్జీలతో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొత్తు కారణంగా టీడీపీ ఇంటికి వెళ్లిపోవడం ఖాయమని, అధిష్టానం పునరాలోచించాలని కోరారు. ఇలాంటి నిర్ణయాల వల్ల వైఎస్సార్‌సీపీకి విజయావకాశాలు పెరుగుతాయన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని, చంద్రబాబు, లోకేష్‌లు అనకాపల్లి వచ్చినప్పుడు పార్టీ కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేశామని పేర్కొన్నారు. ఇటీవల మునగపాక మండలం నాగులాపల్లిలో జరిగిన శంఖారావం సభలో అనకాపల్లి టికెట్ పీలాకే ఇస్తామని లోకేష్ పార్టీ శ్రేణులకు చెప్పిన విషయం గుర్తు చేశారు. తొలి నుంచి జనసేన నిర్మాణంలో పాల్గొన్న పరుచూరి భాస్కరరావుకు కాకుండా ఇటీవల పార్టీలో చేరిన కొణతాలకు టికెట్ ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. పార్టీ నేతలు మళ్ల సురేంద్ర, కాయల ప్రసన్నలక్ష్మి, అధికసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విషాదం

బైక్ అదుపుతప్పి యువకుడి మృతి



పవన్ రత్నాకర్ మృతదేహం

మారేడుమిల్లి (అల్లూరి సీతారామరాజు జిల్లా): మండలంలోని వేజువాడ గ్రామ సమీపం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గుడిస పర్యాటక ప్రదేశాన్ని తిలకించి తిరిగి వస్తుండగా బైక్ అదుపుతప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా తుని పట్టణానికి చెందిన సిద్ధిరెడ్డి పవన్ రత్నాకర్ (22) విశాఖలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఉదయం తుని వెళ్లిన అతను రాజమహేంద్రవరంలోని స్నేహితుల వద్దకు వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పి మరో ఇద్దరు స్నేహితులతో కలిసి ఇంటి నుంచి బయలుదేరాడు. వీరు పర్యాటక ప్రదేశమైన గుడిస హిల్ టాప్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడి నుంచి ఆదివారం తిరిగి వస్తుండగా మండలంలోని వేజువాడ వద్దకు వచ్చేసరికి పవన్ బైకు టైర్ పంక్చర్ అయింది. దీంతో అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని బోదులూరు పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రాము తెలిపారు.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
ఫారం	: రూ.125
బ్రాయిలర్ (లైవ్)	: రూ.145
స్కిన్	: రూ.260
స్కిన్‌లెస్	: రూ.270

విద్యార్థిని గర్భవతిని చేసిన ఉపాధ్యాయుడు

మధురవాడ: నగరంలోని నారాయణ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు ఓ విద్యార్థిని గర్భవతిని చేసినట్టు తెలిసింది. సదరు పాఠశాలలో చదువుతున్న బాలికను మభ్యపెట్టి లోబర్చుకొని శారీరకంగా హింసించి గర్భవతిని చేశాడు. బాలికకు కడుపునొప్పి రావడంతో శనివారం సాయంత్రం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీంతో సదరు డాక్టర్ బాలిక గర్భవతి అని నిర్ధారించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై మాత్రం పోలీసులు నోరు మెదపడం లేదు.

గ్రూప్–2 పరీక్షకు 82.71 శాతం హాజరు

- జిల్లాలో 105 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణ
- 47,491 మందికి గాను 39,300 హాజరు



ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న పోలీస్ కమిషనర్ రవిశంకర్



వుడా పార్కు వద్ద స్కూలులో అభ్యర్థులను చెక్ చేస్తున్న పోలీసు

మహారాణిపేట: జిల్లాలో ఆదివారం జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 105 పరీక్షా కేంద్రాల్లో పరీక్ష జరిగిందని తెలిపారు. ఈ పరీక్షకు 47,491 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 39,300 మంది అభ్యర్థులు హాజరు కాగా 8,191 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. 82.75 శాతం హాజరు నమోదైనట్లు వివరించారు. బీచ్‌రోడ్డులోని జీవీపీ ఎం.ఎల్.బి.టి పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్ష సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, అప్రమత్తంగా వ్యవహరించాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఏవీఎన్ కళాశాలతో పాటు పలు కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ సందర్శించి పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

ఉద్యమాల్లో జయగోపాల్ పాత్ర మరువలేనిది



జయగోపాల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న పలువురు ప్రముఖులు

డాబాగార్డెన్స్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యమాల్లో జయగోపాల్ ప్రభావం ఎంతో ఉందని, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా అలుపెరగని పోరాటం చేశారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. సాంఘిక ఉద్యమకారుడు, ఆంధ్రా పెరియార్ డాక్టర్ జయగోపాల్ సంస్మరణ సభ ఆదివారం డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జేవీ మాట్లాడుతూ తెలుగు నాట ముగ్గురు గోపాల్‌లులో జయగోపాల్ అప్పటి సమాజాన్ని ప్రభావితం చేశారన్నారు. ఒకప్పుడు సామాజిక కార్యక్రమాల్లో యువత ఉండేదని, ప్రస్తుతం అది కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన లేకపోయినా ఉద్యమం ఉందని, దానిని మరింతగా ముందుకు తీసుకుపోవాలన్నారు. చైన్నై నుంచి విచ్చేసిన ద్రవిడ కజగం నేత వీరమణి కుమారుడు వి.అంబురాజు మాట్లాడుతూ జయగోపాల్ సాంస్కృతిక సాంఘిక విప్లవకారుడని, తెలుగు రాష్ట్రాల్లోని యువతకు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఉద్యమం చేపట్టడమే గాక తమిళనాడులో కూడా ఆయన పెరియార్‌తో కలిసి పని చేశారని గుర్తు చేశారు. విశాఖ బీచ్‌రోడ్డులో పెరియార్ విగ్రహం ఏర్పాటుకు జయగోపాల్ కృషి మరువలేనిదన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం సంక్షోభం ఎదుర్కొంటుందని, పేదరికం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి. శ్రీరామమూర్తి, మహిళ చేతన కార్యదర్శి కె.పద్మ, దళిత సేన రాష్ట్ర నాయకుడు పాల్తేటి పెంటారావు, చైతన్య మహిళా సమాఖ్య లలిత, న్యాయవాది గంట మోహన్‌రావు, సాయి నరేందర్, జె.రవి, డాక్టర్ ఎంవీఆర్ కృష్ణ, శరత్, పల్లేటి అప్పారావు, వై.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మ్యూజియం అద్భుతం



శిల్పాలను తిలకిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: మిలాన్ 2024 సందర్భంగా ఇటీవల ఆధునీకీకరించిన విశాఖ మ్యూజియంను కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ఆదివారం సందర్శించారు. పర్యాటకులను ఆకట్టుకునేలా సాగర తీరంలో ఇటీవల చేపట్టిన ప్రాజెక్టుల్లో భాగంగా విశాఖ మ్యూజియంను ఆధునీకీకరించిన సంగతి విదితమే. కళాకారులు రూపొందించిన క్రాఫ్ట్స్, ఆర్ట్స్‌ను అధికారులు పరిశీలించారు. సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా తీర్చిదిద్దిన కళారూపాలు, విశాఖ అందాలతో కూడిన చిత్రాలు, ప్రాచీన శిల్పాకళా నైపుణ్యంతో కూడిన దేవతామూర్తుల విగ్రహాలు పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. చారిత్రక విశేషాలతో కూడిన గ్రంథాలు, రికార్డులు చూశారు. ఇంటక్ సభ్యుడు వి.ఎడ్వర్డ్ పాల్ విశాఖ చరిత్రకు సంబంధించిన వస్తువులు, చిత్రాల గూర్చి కలెక్టర్‌కు వివరించారు. హెరిటేజ్, ఆర్కియాలజీ మ్యూజియంలో పలు చోట్ల వస్తువులకు సంబంధించిన సమాచారం ప్రదర్శించమని మ్యూజియం క్యూరేటర్ వెంకటరమణకు వివరించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ మ్యూజియంలో నిత్యం శుభ్రత చర్యలు చేపట్టాలని క్యూరేటర్‌ను ఆదేశించారు. సీసీ కెమెరాలు, ఫైర్ పరికరాలు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ ఉపకార్యనిర్వహణాధికారి సత్యనారాయణరాజుకు కమిషనర్ ఆదేశించారు. అనంతరం ఆర్బన్ స్కెచర్స్‌కి సంబంధించి వైజాగ్ స్కెచర్స్ బృందం విశాఖ మ్యూజియం ఆవరణలో చిత్రీకరించిన చిత్రాలను తిలకించిన కలెక్టర్ మల్లికార్జున.. ప్రీతి సంగీత, పీవీ హనుమంతు బృంద సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్కియాలజీ మ్యూజియం అసిస్టెంట్ డైరెక్టర్ ఫాల్గుణరావు పాల్గొన్నారు.

ఎస్‌ఐపై మందుబాబు వీరంగం



ఎస్‌ఐ మనోహర్ అడ్డుకున్న మందుబాబు

బీచ్‌రోడ్డు: తన బంధువుల ద్విచక్ర వాహనం ఆపినందుకు ఓ ఎస్‌ఐపై మందుబాబు దురుసుగా ప్రవర్తించాడు. మూడో పట్టణ పోలీసు స్టేషన్ ఎస్‌ఐ మనోహర్ బీచ్‌రోడ్డులో ఆదివారం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఎస్‌ఐను వైఎస్సార్ విగ్రహం వద్ద మందుబాబు నిలిపివేశాడు. వాహనం ముందు చక్రాన్ని తన రెండు కాళ్ల మధ్యలో పెట్టి కదలనివ్వకుండా తన బంధువుల వాహనం ఎందుకు ఆపావు అంటూ దుర్భాషలాడాడు. నువ్వు పోలీసు అయితే నాకేంటి..నీ అంతు చూస్తా అంటూ వార్నింగ్ ఇచ్చాడు. మందుబాబు ఇంతలా రెచ్చిపోతున్నా...జనం చూసి వెళ్తున్నారే తప్ప ఆపేందుకు ప్రయత్నించలేదు. అయితే అప్పటికే సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మందుబాబును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంప్ చెన్నై

విశాఖ స్పోర్ట్స్: ఆలిండియా మేజర్ పోర్ట్స్ కబడ్డీ చాంపియన్‌షిప్‌ను చెన్నై పోర్ట్ కైవసం చేసుకుంది. ట్యుటికోరిన్ పోర్ట్ జట్టు రన్నరప్‌గా నిలవగా డిఫెండింగ్ చాంప్ హోదాలో బరిలోకి దిగిన ముంబై పోర్ట్ జట్టు సెకండ్ రన్నరప్‌గా సరిపెట్టుకుంది. విశాఖ పోర్ట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన టైటిల్ పోరులో చెన్నై పోర్ట్ జట్టుకు ట్యుటికోరిన్ పోర్ట్ జట్టు గట్టి పోటీ ఇచ్చింది. హోరాహోరీగా సాగిన టైటిల్ పోరులే (53–48) ఐదు పాయింట్ల తేడాతో చెన్నై పోర్టు జట్టు విజయాన్నందుకుంది. జట్టు తరపున దినేష్ 10, స్టువర్ట్ 20, కామేశ్వరన్ 15 పాయింట్లు సాధించి జట్టుకు టైటిల్ అందించారు. ఈ టోర్నీలో బెస్ట్ రైడర్‌గా ఎన్.భరత్(ట్యూటికోరిన్), బెస్ట్ ఆటగానిగా సౌరబ్‌రౌత్(ముంబై) బెస్ట్ ఆల్‌రౌండర్‌గా దినేష్‌కుమార్(చెన్నై పోర్ట్) నిలిచారు. పోటీల ముగింపు కార్యక్రమంలో వీపీటీ సీఏఓ ఎస్.శివకుమార్, వీపీఏ డిప్యూటీ చైర్మన్ డి.దుర్గేశ్ కుమార్ హాజరై విజేతలకు ట్రోఫీలందించారు.

అమృత ఆహారంతో ఆరోగ్యకర జీవనం



విత్తనాలను పరిశీలిస్తున్న జియ్యాని శ్రీధర్

సింహాచలం: అమృత ఆహారం పండించి ఆరోగ్యంగా జీవించాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పిలుపునిచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురంలోని గోశాలలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ దారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలకు అంట్లు కట్టే శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న శ్రీధర్ మాట్లాడుతూ కూరగాయల మొక్కలకు అంట్లు కట్టడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. అలాగే గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ దారుల సంఘం ద్వారా జీవామృతం, మట్టి, దేశీయ ఆవుల ఎరువు, కూరగాయల మొక్కల నారు విత్తనాలు పంపిణీ చేయడం చాలా అభినందనీయం అన్నారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ రైతులకు చేయూత ఇవ్వడం కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ దారుల సంఘం అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ, కార్యదర్శి సీహెచ్.అశోక్, కోశాధికారి సాయిబాబు, రాష్ట్ర ప్రతినిధి పీఎల్ఎస్.రాజు, వ్యవసాయ సైంటిస్ట్ అశోక్‌కుమార్, సంస్థ ప్రతినిధులు పోదీశ్వర్ పురోహిత్, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు. ఎనిమిది రకాల వంగ నారు, నాలుగు రకాల టమాటో నారు, పచ్చిమిర్చి, ఉల్లి, బంతి నారు, ఫ్యాషన్ డ్రైఫ్రూట్, అడవి అనబకాయ, కరక్కాయ, సబ్జా తదితర విత్తనాలను పంపిణీ చేశారు.

నేడు జీవీఎంసీలో డయల్ యువర్ మేయర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ మేయర్ కార్యక్రమం నిర్వహించనున్నారు. మేయర్ హరి వెంకటకుమారి ఫిర్యాదులు స్వీకరించనున్నారు. అనంతరం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం(స్పందన) నిర్వహించనున్నారు.నగరవాసులు తమ సమస్యలు తెలపవచ్చన్నారు.